క్లుప్తంగా

ఘనంగా పి.వి.రావు జయంతి

కంకిపాడు: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు 74 వ జయంతి వేడుకలు పట్టణంలోని పి.వి.రావు మాల మహానాడు జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు మాట్లాడుతూ పీవీ రావు ఆశయ సాధన కోసం మాలలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు పైయార్థ రామకృష్ణ, నాయకులు ముప్వ సుబ్రహ్మణ్యం, సరిహద్దు ఆంటోని, దర్శి శ్రీనివాస్ గాంధీ, గోవాడ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో ఎమ్మెల్యే వంశీ పర్యటన

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి శివారు రామచంద్రాపురంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పర్యటించారు. మొదట గ్రామ సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పలువురు కార్యకర్తలను నేరుగా కలుసుకున్నారు. గ్రామ కన్వీనర్ సర్నాల రాంబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సహకార బ్యాంకు చైర్‌పర్సన్ తుల్లిమిల్లి ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యులు కొండా సీతారామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, మండల కన్వీనర్ కైలే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్తాలమిక్‌ల సమస్యలు పరిష్కారానికి వినతి

కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద పనిచేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కారం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.రాజేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రామిరెడ్డిని కంటి వెలుగు నోడల్ ఆఫీసర్ డాక్టర్ యాస్మిన్‌ను బుధవారం ఆయన విజయవాడలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు వివిధ జిల్లాల ప్రతినిధులు ఎంఎస్.తేజ, పి.నాగలక్ష్మి, జి.సంధ్య, ఎ.శ్రీను, సతీష్, కాంతి, గంగయ్య ఉన్నారు.

13న తాగునీటి బోరు ప్రారంభం

ఉంగుటూరు: గారపాడులో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఎమ్మెల్యే వంశీమోహన్ ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామీణ యోజన గ్రాంట్ ద్వారా రూ.4.50 లక్షలతో నిర్మాణం చేసిన బోరును ఈ నెల 13న ఎమ్మెల్యే వంశీమోహన్ ప్రారంభించనున్నారు. ఎంపీడీఓ శేషగిరిరావు బుధవారం ఈవోపీఆర్డీ బాషాతో కలసి బోరును పరిశీలించారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు నలందా విద్యార్థుల ఎంపిక



కంకిపాడు: రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఈడుపుగల్లు నలందా విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా జట్టులో స్థానం పొందిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 6వ తేదీన పాఠశాలలో నిర్వహించారన్నారు. పాఠశాలకు చెందిన ఎండీ ఖాన్, వి.జయసూర్య, కె.లోహిత్ రాజ్, కె.జేమ్స్, కౌశిక్‌చంద్ర, వర్షంనాయుడు, మోహిత్, రుతిక్, ప్రణీత్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన దివ్యకారుణ్యమూర్తి మహోత్సవాలు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద కొండపై ఉన్న యేసు దివ్యకారుణ్యమూర్తి పుణ్యక్షేత్ర మహోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. గడచిన మూడు రోజులుగా విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎం.ఆంతోని బాలజోసఫ్ ఆధ్వర్యంలో జపమాల, సమష్టి దివ్యబలిపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం ముఖ్య అతిథిగా విజయవాడ బిషప్ టి.జోసఫ్ రాజారావు పాల్గొని భక్తులకు సందేశమిస్తూ క్రీస్తు చూపిన మార్గం సర్వమానవాళికి అనుసరణీయమని చెప్పారు. అనంతరం సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులను ఆశీర్వదించారు. బిషప్‌కు ముస్తాబాద విచారణ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి సన్మానించారు. భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

పెనమలూరు: తెలంగాణ మద్యంతో ఉన్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోరంకిలో తెలంగాణ మద్యం ఉందన్న సమాచారంతో ఎస్ఈబీ అదనపు సూపరింటెండెంట్ రామాంజనేయులు ఆదేశాల మేరకు సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడిలో సముద్రపు ప్రవీణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద 122 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఆత్కూరు సొసైటీ బాధితులకు పరిహారం

- ఎమ్మెల్యే వంశీ చొరవతో చేకూరిన న్యాయం
- తొలివిడతగా డిపాజిట్లలో సగం నగదు చెల్లింపు
- వంశీ మేలు మరువలేమంటున్న సొసైటీ సభ్యులు



ఎమ్మెల్యే కార్యాలయంలో చెక్కులు అందుకున్న బాధితులు

ఉంగుటూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బాధితులకు నష్టపరిహారం చెల్లించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరొకసారి నిరూపించుకుంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ కృషితో కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సహకారంతో 139 మంది లబ్ధిదారులకు వారు నష్టపోయిన రూ.2.25 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎంతో మంది పేద, మధ్య తరగతి రైతులు తాము ఆరుగాలం కష్టపడి సంపాదించిన సొమ్మును దాచుకున్నారు. సొసైటీలో కార్యదర్శి సురవరపు శంకర్‌రావు, క్యాషియర్ శివకుమారి 2004 సంవత్సరం నుంచి కొద్ది కొద్దిగా ఖాతాదారులు దాచుకున్న డబ్బును నకిలీ బాండ్‌లు, ఫోర్జరీ సంతకాలతో ఎఫ్‌డీలు, లోన్‌లు, ఎస్‌బీ ఖాతాల్లో నగదు స్వాహా చేయడం ప్రారంభించారు. గత ఏడాది తేలప్రోలు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ తనిఖీ చేసేందుకు వస్తున్నాడనే సమాచారంతో శంకర్‌రావు పరారయ్యాడు. దీంతో కేడీసీసీ బ్యాంకు అధికారులు సొసైటీలోని రికార్డులన్నీ స్వాధీనపరచుకుని విచారణ చేయగా ఈ అవినీతి బాగోతం బయటపడింది.

ఈ విచారణలో 139 మందికి చెందిన రూ.2.25 కోట్లు స్వాహా చేసినట్లు గుర్తించారు. 43 ఎఫ్‌డీల నుంచి రూ.1.8 కోట్లు, 87 సేవింగ్ ఖాతాల నుంచి రూ.70,72,000, ఎఫ్‌డీలపై రూ.48 లక్షలు రుణాలు తీసుకుని స్వాహా చేశాడు. విషయం తెలిసిన బాధితులందరు పేదలు కావడంతో అందరు దిక్కుతోచని స్థితిలో స్థానిక ఎమ్మెల్యే వంశీని ఆశ్రయించారు. వారి గోడు విన్న ఎమ్మెల్యే వంశీ ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుకు వివరించగా, ఆయన వెంటనే బ్యాంకు అధికారులతో మాట్లాడి బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా మచిలీపట్నం సహకార కేంద్ర బ్యాంకు నుంచి తొలివిడతగా రూ.1.10 కోట్లు మంజూరు చేశారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. దీంతో లబ్ధిదారులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో ఎమ్మెల్యే ఆదుకున్నారు



సొసైటీలో కార్యదర్శి, క్యాషియర్ నమ్మకంగా ఉండే వారు. నా దగ్గర ఉన్న డబ్బులను ఉన్న ఊర్లోనే దాచుకుంటే బాగుంటుందని దాచుకున్నాను. డబ్బులు స్వాహా చేసి కార్యదర్శి పరారయ్యాడనే విషయం తెలిసి దిక్కుతోచలేదు. ఆ సమయంలో బాధితులందరం ఎమ్మెల్యే వంశీ వద్దకు వెళ్లి చెప్పుకున్నాం. ఆయన తక్షణమే స్పందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 50శాతం డబ్బులు చెల్లించారు.

-అనార్

ఎమ్మెల్యే వంశీ మేలు మరువలేం



బ్యాంకు సిబ్బంది దాచుకున్న డబ్బులు దోచుకుంటే భయపడ్డాను. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే వంశీకి మా బాధను చెప్పుకున్నాం. ఆయన చొరవ తీసుకుని డబ్బులు మంజూరు చేయించారు. మా డిపాజిట్లో సగం డబ్బులు చెల్లించారు. ఎమ్మెల్యే వంశీ చేసిన మేలును మరచిపోను. ఆయనకు రుణపడి ఉంటాను.

-పైడి సింహాచలం

విశేష పూజలందుకున్న అభయాంజనేయుడు

- 1008 మల్లెపూలు, బంగారు, వెండి పుష్పాలతో అర్చన
- భక్తిపారవశ్యం నింపిన శ్రీవెంకటేశ్వర గానామృతం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఆధ్యాత్మిక వేదికపై నిర్వహిస్తున్న వెంకటేశ్వరస్వామి గానమృతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన జరిగాయి. దేవస్థానాన్ని రకరకాల పూలతోనూ, అభయాంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం దంపతులతో ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం వెంకట శేషారామాచార్యులు హనుమంతునికి 1008 మల్లెపూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముముక్షు భజన మండలి ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర స్వామి గానామృతం పేరుతో శ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వరుని గానామృతాన్ని తెలుగు పండితురాలు డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి సవివరంగా భక్తులకు తెలియజేశారు. సాయంత్రం వాయుపుత్రునికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్యామల నాట్య కళ అకాడమీ (కైకలూరు) ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంది. మహిళా కళాకారులు సంప్రదాయ నృత్యాలతో అదరహో అనిపించారు. జయశ్రీ నాట్యమండలి (గుడివాడ) ఆధ్వర్యంలో నిర్వహించిన పూలరంగడు హాస్యనాటకం ప్రేక్షకులను అలరించింది.

వేసవి శిక్షణ శిబిరంలో ఆటల పోటీలు

గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం, ముస్తాబాద శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పురుషోత్తపట్నం లైబ్రేరియన్ కె.కృపానందం, సచివాలయం కార్యదర్శి జి.ఈశ్వర్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ముస్తాబాద లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు పుస్తక పఠనం చేశారు.

గృహ నిర్మాణం వేగవంతం చేయండి

కంకిపాడు: జగనన్న లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ జీవీ సూర్యనారాయణ ఆదేశించారు. మండలంలోని వేల్పూరులో బుధవారం జగనన్న లేఅవుట్‌లలో నిర్మిస్తున్న గృహాల నిర్మాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లేఅవుట్‌లలో కల్పించిన వసతులపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం కావటానికి కంకిపాడు గ్రామ పంచాయతీ నుంచి బోరు వసతి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జగనన్న లేఅవుట్‌లలో వసతులు కల్పించి, గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులను చైతన్యపరిచి డ్వాక్రా సభ్యులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎల్‌డీవో నాంచారరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై సదస్సు

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి మాట్లాడుతూ పర్యావరణ రక్షణకు మొక్కలు పెంచటం ఒక్కటే మార్గమని చెప్పారు. వీఆర్వో వెంకటేశ్వరరావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సానుకూల దృక్పథంతో విజయాలు సాధించాలి



గన్నవరంరూరల్: విద్యార్థులు సానుకూల దృక్పథంతో విజయాలు సాధించాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ సూచించారు. మండలంలోని గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌ను బుధవారం ఆమె సందర్శించి 10వ తరగతి తప్పిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. అపజయాలకు కుంగిపోకూడదని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎంఈవో బి.శ్రీనివాస్, హెచ్‌ఎం కేఏస్ జగదీశ్వరరావు, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు, ఎంఆర్ఐ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ చిన్న, సన్నకారు రైతులకు వరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మెట్ట ప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ పథకం వరం లాంటిదని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ సక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో సయ్యద్ సర్దార్‌కు చెందిన మామిడి తోటలో వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన వ్యవసాయ బోరు పనులకు బుధవారం ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. తొలుత గాంధీ పూజా కార్యక్రమాలు చేసి బోరు పనులు లాంఛనంగా ప్రారంభించారు. మల్లవల్లిలో 29 మంది రైతులు వైఎస్సార్ జలకళ పథకం ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, ఎంపీటీసీ సభ్యుడు చాకిరి వెంకట నారాయణ, వేముల శ్రీను, కట్టుబోయిన రంగారావు, తూము హరిబాబు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే వంశీ రూ.లక్ష విరాళం

గన్నవరంరూరల్: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి బుధవారం ఎమ్మెల్యే వంశీమోహన్ రూ.లక్ష విరాళం అందజేశారు. స్ఫటిక లింగాన్ని దర్శించిన ఆయన నిర్వాహకులకు ఈ విరాళం అందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, గ్రామ కన్వీనర్ సర్నాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు కొండా సీతారామయ్య, స్థానిక నాయకులు కూరేటి కోటేశ్వరరావు, కాజా సుబ్బారావు, కోటగిరి వరప్రసాద్, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గన్నవరం: విజ్ఞాన సముపార్జన కోసం పుస్తక పఠనం అలవర్చుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిమట రామారావు విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన విలువైన పుస్తక సంపద గ్రంథాలయాల్లో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు వారానికి ఒకరోజైనా గ్రంథాలయాన్ని సందర్శించాలని సూచించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి దొండపాటి బాబూరావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆవుటపల్లి పార్థసారథి, కంభంపాటి ధర్మారావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం

పెనమలూరు: పోరంకి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారి కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి, రమా సహిత శ్రీసత్యనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవం వేదమంత్రాల నడుమ ఘనంగా చేశారు. ఆలయంలో బుధవారం సంతాన ప్రాప్తి కొరకు పుత్రకామేష్టి హోమం చేశారు. గరుడ వాహనం పై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. కళాకారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. ఆలయంలో గురువారం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

పెనమలూరు: కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకుని ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. గ్రామంలో బుధవారం ఆర్బీకేలో జరిగిన కార్యక్రమంలో ఆయన కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవటానికి దరఖాస్తులు అందచేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు దేవప్రియుడు, నాగేశ్వరరావు, ప్రసాద్, ఆర్బీకే ఇన్‌చార్జి పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే సనత్‌నగర్ అభివృద్ధి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కృషి కారణంగానే సనత్‌నగర్ ప్రాంతం అభివృద్ధి చెందిందని వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. సనత్‌నగర్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.2.50 కోట్లు ఖర్చు చేసి సనత్‌నగర్‌ను అభివృద్ధి చేశామని వివరించారు. సమావేశంలో నేతలు చాన్‌బాషా, వల్లభనేని మణికంఠ, ఖాదర్, పఠాన్ అహ్మద్, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఉన్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: గంజాయితో ఉన్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ భానుప్రకాష్ కానూరు శ్మశానవాటిక వద్ద గంజాయితో ఉన్న సమయంలో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 900 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఎన్ఆర్ఎల్ఎం టీం సభ్యుల సందర్శన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు, ప్రసాదంపాడు గ్రామాల్లో బుధవారం ఎన్ఆర్ఎల్ఎం (నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్) టీం సభ్యులు సందర్శించారు. స్వయం సహాయక సంఘ సభ్యులను కలిసి వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కేర్ హెల్త్ ఇన్స్యూ ప్రాసెసింగ్ ఫీజు, వెట్టింగ్ చార్జెస్, లోన్ ఎన్‌హాన్స్‌మెంట్ చార్జెస్ వంటి సమస్యలను ఎన్ఆర్ఎల్ఎం టీం దృష్టికి స్వయం సహాయక సంఘ మహిళలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నిడమానూరులోని యూనియన్ బ్యాంక్, ప్రసాదంపాడు సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లను కలిసి ఈ సమస్యలపై చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని టీం సభ్యులు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ గుప్తా, ఎస్ఈఆర్‌పీ నుంచి కేశవ, ప్రాజెక్ట్ డైరెక్టర్ విన్సెంట్, డీఆర్‌డీఏ నుంచి శ్రీనివాసరావు, ఏపీఎం గంధం చంద్రశేఖర్, సీసీ, వీవోఏలు హాజరయ్యారు.

జగనన్న గృహాల నిర్మాణం వేగిరం చేయాలి

జెడ్పీ సీఈవో జ్యోతిబసు



వణుకూరు లేఅవుట్‌లో గృహాల నిర్మాణం వివరాలు అడుగుతున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు

పెనమలూరు: వణుకూరు గ్రామ పరిధిలో ఉన్న జగనన్న లేఅవుట్‌లలో గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటానని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.జ్యోతిబసు సిబ్బందిని హెచ్చరించారు. ఆయన బుధవారం వణుకూరు జగనన్న లేఅవుట్‌లలో గృహాల నిర్మాణంపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జగనన్న కాలనీలో గృహాల నిర్మాణంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆయన అధికారులను ప్రశ్నించారు. మద్దూరు వద్ద నుంచి ఇసుక కొరత ఉందని వారు సీఈవో దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్య పరిష్కారం చేయాలని ఆయన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు గృహాల నిర్మాణం చేసుకోవటానికి మెటీరియల్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని, మంజూరు చేసిన 2,865 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటానని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టీవీ సతీష్, ఎంపీడీఓ సునీతా శర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు దగ్ధం



మంటల్లో కాలిపోయిన ద్విచక్ర వాహనాలు

రామవరప్పాడు: అపార్టుమెంట్ సెల్లార్‌లో పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి దగ్ధం చేసిన ఘటన మంగళవారం అర్ధరాత్రి ఎనికేపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపాడు శివాలయం పల్లాలు 3వ వీధిలోని సన్‌రైజ్ రెసిడెన్సీలో నడిపిల్లి ప్రభాకర్ నివాసం ఉంటున్నారు. ఈయన ఏపీ సచివాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభాకర్ తన ద్విచక్రవాహనంపై విధులకు హాజరై వస్తుంటారు. ఈ క్రమంలో ఈనెల 9 న ద్విచక్రవాహనంపై తన విధులకు హాజరై సాయంత్రం 6 గంటల సమయంలో తిరిగి వచ్చి తన వాహనాన్ని సెల్లార్‌లో పార్కింగ్ చేశారు. రాత్రి సుమారు 12 గంటల సమయంలో మంటలు రావడం గమనించిన వాచ్‌మెన్ ప్రభాకర్‌కు సమాచారం అందించాడు. వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనంతో పాటు పక్కనే ఉన్న మరో యాక్టివా వాహనం కూడా మంటల్లో కాలిపోతున్నాయి. వెంటనే అప్రమత్తమై ద్విచక్రవాహనాలకు అంటుకున్న మంటలను చుట్టుపక్కల వారి సహాయంతో ఆర్పివేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పటమట ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగొలనులో అక్రమ నిర్మాణాల కూల్చివేత



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన దుకాణాన్ని ధ్వంసం చేసిన రెవెన్యూ అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఆరుగొలనులో టీడీపీ నేత, తిప్పనగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మించిన షాపులను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవటంతో నేరుగా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని జెడ్పీహైస్కూల్ ఎదురుగా రోడ్డు వెంబడి స్థలాన్ని టీడీపీ నేత మాదాల శ్రీనివాసరావు ఆక్రమించుకుని ఎరువుల దుకాణాన్ని నడుపుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందటంతో బాపులపాడు తహసీల్దార్ గత నెల 24వ తేదీన నోటీసులు జారీ చేసి, నోటీసులను ఆక్రమిత స్థలంలోని షాపునకు అంటించారు. అయినప్పటికీ ఆక్రమణ తొలగించకపోవటంతో మంగళవారం ఉదయం మరోమారు రెవెన్యూ అధికారులు నేరుగా వచ్చి ఆయనకు మౌలిక ఆదేశాలిచ్చారు. ఎలాంటి స్పందన లేకపోవటంతో బాపులపాడు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజేష్ కుమార్, వీఆర్వో చౌటపల్లి కల్యాణ్ జేసీబీ యంత్రాల సాయంతో అక్రమ నిర్మాణాలను ధ్వంసం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ బుధవారం గ్రామానికి వచ్చి మాదాల శ్రీనివాసరావును పరామర్శించారు. రెవెన్యూ అధికారులు వ్యవహరించిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా మాదాల శ్రీనివాసరావు అధీనంలో ఉన్న స్థలంలోని దుకాణాన్ని కూల్చివేయటం దుర్మార్గమని మండిపడ్డారు. ఆయనతో పాటు తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరు సాయి కల్యాణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, టీడీపీ గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు వద్రాణం హరిబాబు నాయుడు ఉన్నారు.

మామిడి, ఆయిల్‌పామ్ సాగులో సస్యరక్షణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మామిడి, ఆయిల్‌పామ్ సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి తెలిపారు. బాపులపాడు మండలంలోని మల్లవల్లి, రంగన్నగూడెం గ్రామాల్లో మామిడి, పామాయిల్ తోటలను జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.విజయలక్ష్మితో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మామిడి రైతులు కాయలకు విధిగా ఫ్రూట్ కవర్ కట్టుకోవాలని చెప్పారు. లేనిపక్షంలో పండు ఈగ దాటికి పంటనష్టం వాటిల్లుతుందన్నారు. కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలనుకునే రైతులు ముందుగా తమ పరిధిలో రైతు భరోసా కేంద్రంలో సంప్రదించి, నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి చెప్పారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో ఈ ఏడాది 400 హెక్టార్లలో బిందు సేద్యంలో సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. పామాయిల్ సాగులో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకునే రైతులకు 90 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.